క్లుప్తంగా

కదిలిన యంత్రాంగం



అంబేడ్కర్‌నగర్‌లో మురుగునీటి గుంటలను శుభ్రపరుస్తున్న హరితరాయబారులు

సాక్షి ఎఫెక్ట్..

ఎన్‌పీకుంట: అధికార యంత్రాంగం కదిలింది. సిబ్బందితో పారిశుధ్య పనులు చేపట్టింది. మండల కేంద్రం ఎన్‌పీకుంటతో పాటు బత్తినిగారిపల్లిలో చెత్తకుప్పలు, మురుగునీటి గుంటలు పేరుకుపోయి అపరిశుభ్రంగా తయారవడంపై 'ఇలా ఉంటే రోగాలు రావా..?' అన్న శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి, సీహెచ్‌ఓ నాగలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ కె.మహేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఆరోగ్యకార్యకర్త విజయ్‌కుమార్‌లు స్పందించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్, పెడబల్లి బజార్, కల్లంగడిమిట్టతో పాటు బత్తినగారిపల్లిలో పర్యటించి చెత్తకుప్పలను, మురుగునీటి గుంటలను హరిత రాయబారులచేత శుభ్రం చేయించారు. దోమలు వ్యాప్తి చెందకుండా అబేట్ మందును పిచికారీ చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధమ్మ, ఏఎన్‌ఎమ్ శంకరమ్మ, పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది, హరిత రాయబారులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి టౌన్: పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం పుట్టపర్తిలో సత్యసాయి గిరి ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. తొలుత ప్రశాంతినిలయం ముఖద్వారం వద్ద అందంగా అలంకరించిన రథంలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ సర్కిల్ పెట్రోలు బంకు, చింతతోపు, శివాలయం వీధి, హనుమాన్ సర్కిల్, గోవిందయ్య పేట, పెద్ద బజార్ మీదుగా ఊరేగించి తిరిగి ప్రశాంతినిలయానికి చేర్చారు. కార్యక్రమంలో పట్టణ వాసులతో పాటు దేశ విదేశాలకు చెందిన సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

చట్ట పరిధిలో పరిష్కారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఎస్పీ ఆదినారాయణ

పుట్టపర్తి టౌన్: ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలకు చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని డీఎస్పీ ఆదినారాయణ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 65 అర్జీలను డీఎస్పీ స్వీకరించారు. వాటిని ఆయా పోలీస్ స్టేషన్లకు పంపి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సీఐ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

నేత్రదానంపై అవగాహన



బైకు ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వదీప సేవా సంఘం సభ్యులు

ధర్మవరం అర్బన్: నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్ తెలిపారు. సోమవారం విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకులు కోళ్ల మొరం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన బైకు ర్యాలీని సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్, కంటి వైద్యులు నరసింహులు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు మాధవి, విజయ, రాముడు, సత్యనిర్ధారణ్, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప, విశ్వదీప సేవా సంఘం అధ్యక్షులు గాజుల సురేష్, చంద్రశేఖర్‌రెడ్డి, మాధవ్, చంద్రశేఖర్, జుజారు రఘు, ప్రభాకర్‌రెడ్డి, ధనుంజయ, ఓబులయ్య, గాజుల శేషు, నాగేశం, నాగార్జున, వెంకటేష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

తనకల్లు: అన్నదాత పోరుకు మద్దతుగా మంగళవారం తనకల్లులోని చౌడేశ్వరీ ఆలయం వద్ద నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి సోమవారం తెలిపారు. అమ్మవారి ఆలయం నుండి కదిరి ఆర్డీఓ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఉదయం 8:30 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీకి రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

వ్యవసాయ రంగం నిర్వీర్యం

- సీఎం చంద్రబాబుపై మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి మండిపాటు



అన్నదాత పోరు ప్రచార పోస్టర్లను విడుదల చేస్తున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన ధర్మవరంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ నెల 9న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'అన్నదాతపోరు' నిరసన కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు సకాలంలో యూరియా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటన్నారు. బ్లాక్‌మార్కెట్‌కు బాసటగా నిలుస్తూ బాబు ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానాల కారణంగానే యూరియా కొరత ఏర్పడిందన్నారు. గత యేడాది రైతు భరోసానిధులను అందించకుండా దారుణంగా మోసం చేశారన్నారు. ఈ యేడాది రైతు భరోసా నిధులను అరకొర అందించి రైతులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అరటి, చీని, వేరుశనగ తదితర పంటలకు గిట్టుబాటు ధర లేక పోవడంతో రైతులు నిండా మునిగిపోయరన్నారు. రైతు వ్యతిరేఖ విధానాలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్మవరంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టే నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి చందమూరి నారాయణరెడ్డి, ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలిమి రామయ్య, జిల్లా నాయకులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, షేక్ చాంద్‌బాషా, కత్తె పెద్దన్న, నాగానందరెడ్డి, పోతిరెడ్డి, పోతులనాగేపల్లి శివారెడ్డి, వెంకటేష్, దేవరకొండ రమేష్, చౌడయ్య, కుణుతూరు గోపాల్, మహ్మద్‌రఫీ, చిరువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్ విద్యార్థి విభాగ్ రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల అమర్‌నాథ్‌రెడ్డి, రెడ్డివారిరాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత పోరు ర్యాలీకి తరలిరండి'

చెన్నేకొత్తపల్లి: రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించ తలపెట్టిన 'అన్నదాత పోరు' ర్యాలీని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి ర్యాలీగా వెళ్లి ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తామన్నారు. మండలం నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున కార్యక్రమానికి తరలిరావాలని ఆయన కోరారు.

అన్నదాత పోరును విజయవంతం చేయండి







కదిరి, గాండ్లపెంట, తనకల్లులో అన్నదాత పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

కదిరి టౌన్: యూరియా సహా రైతన్నలకు నాణ్యమైన విత్తనాలతో పాటు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని మంగళవారం కదిరిలో 'అన్నదాత పోరు' నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ తెలిపారు. రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పెద్ద ఎత్తున కదిరి వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. అక్కడి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కదిరి అర్బన్: యూరియా సమస్యపై రైతులకు బాసటగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజన్ కేంద్రం కదిరిలో మంగళవారం నిర్వహించే 'అన్నదాత పోరు'ను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కార్యక్రమ పోస్టర్లను కదిరి మండల నాయకులు విడుదల చేశారు. రైతులు, పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల సభ్యులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మణికంఠనాయక్, ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, విశ్వనాథ్, శ్రీనివాసులునాయక్, చలపతినాయక్, ఆది తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: కదిరిలో మంగళవారం నిర్వహించే 'అన్నదాత పోరు'కు నల్లచెరువు మండల రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీగా తరలి రావాలని మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కార్యక్రమ పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. మంగళవారం ఉదయం 9 గంటలకు వ్యవసాయ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా కదిరికి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టెంపుల్ మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పోరెడ్డి వెంకటరెడ్డి, గోవిందురెడ్డి, ఎస్టీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ హైటెక్ రమణ, మాజీ డైరెక్టర్ ఆదిమూర్తి, కార్యదర్శి లక్ష్మీపతి, మైనార్టీ నాయకుడు నజీర్, డీజే తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: 'అన్నదాత పోరు' పోస్టర్లను వైఎస్సార్‌సీపీ గాండ్లపెంట మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాతాం జగన్మోహన్, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, బీసీ కన్వీనర్ జక్కల నరసింహగౌడ్, యూత్ కన్వీనర్ రవిచంద్రారెడ్డి, వైస్ కన్వీనర్ శంకర్‌నాయుడు, మాజీ డైరెక్టర్ మేకల నరసింహులు, మండల నాయకులు గజ్జల రామకృష్ణారెడ్డి, అత్తార్ ఆసిఫ్, రామాంజులరెడ్డి, అజీమ్, యోగానందరెడ్డి, శివ, ప్రభాకరరెడ్డి, నాగరాజు, నటరాజ్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం పది గంటలకు 'అన్నదాత పోరు'లో భాగంగా కదిరిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎన్‌పీకుంట మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి తెలిపారు. పార్టీ శ్రేణులు, రైతులు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.



నల్లచెరువులో పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

తనకల్లు: కదిరి రెవెన్యూ డివిజన్ కేంద్రంలో మంగళవారం నిర్వహించే 'అన్నదాత పోరు' పోస్టర్లను తనకల్లు మండల కేంద్రంలోని దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద మండల నాయకులు సోమవారం విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం కన్వీనర్ విజయలక్ష్మి, మండల కమిటీ సభ్యులు ముస్తఫా, కరే నరేంద్ర, బాబ్‌జాన్, సూరి, నాయకులు బీఎస్ కలాం, మాధవరెడ్డి, శంకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బీఎస్ నిజాం, రెడ్డిపీరా, పూల శంకర్, లక్ష్మీరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి, శివ, బయారెడ్డి, శివరాంరెడ్డి, కుమార్, ప్రకాష్, హరి, యశ్వంత్‌రెడ్డి, జగదీష్, అమీర్, నరసింహులు, విజయ్‌కుమార్, సాలెమ్మ పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బసంపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త చంద్రశేఖర్ అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సానే రాజారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మక్బూల్ అహ్మద్

తనకల్లు: దిగువ చెక్కవారిపల్లి సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజు తల్లి వీరనాయణమ్మ (70) గుండెపోటుతో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ గ్రామానికి వెళ్లి.. నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ముళ్లోళ్లపల్లిలో ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్త శ్రీనివాసులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, నాయకులు కొక్కంటి శ్రీనివాసులునాయుడు, మండల ఉపాధ్యక్షుడు కొండకమర్ల ముస్తఫా, రెడ్డిపీరా, బీరప్ప, యశ్వంత్‌రెడ్డి, సూరి తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రూల్స్ సమస్య పరిష్కరించాలి

పుట్టపర్తి: ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవ చూపాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ తదితరులు కోరారు. సోమవారం వారు బుక్కపట్నం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. జిల్లా కార్యదర్శి రవిచంద్ర, మండల శాఖ అధ్యక్షుడు శంకర్‌నారాయణ, హనుమంతు, జయప్రకాశ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

ఓడీచెరువు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం సిబ్బందికి సూచించారు. అంటువ్యాధుల నివారణకు ఓడీచెరువు మండలంలోని బీసీ కాలనీ, బోడెద్దులపల్లి, రామిరెడ్డిపల్లిలో చేపట్టిన పరిశుభ్రత, వైద్య శిబిరం తదితర కార్యక్రమాలను ఆమె సోమవారం తనిఖీ చేశారు. ఆరోగ్య సిబ్బంది ద్వారా చేపట్టిన ఇంటింటి సర్వే, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి.. ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సునీల్, వైద్యాధికారులు డాక్టర్ కమల్ రోహిత్, డాక్టర్ భానుప్రకాశ్, పాల్గొన్నారు.

బత్తలపల్లి: ప్రాణాంతక వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని విద్యార్థినులకు పలువురు సూచించారు. సోమవారం సంజీవపురం సమీపంలో కేజీబీవీలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు చిల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రాణాంతక వ్యాధులు, మాదక ద్రవ్యాలు, తదితర వాటిపైన అవగాహన సదస్సు నిర్వహించారు.

హామీల అమల్లో చంద్రబాబు విఫలం

రామగిరి: హామీలను అమలుచేయడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు మండిపడ్డారు. సోమవారం మండలంలోని పెద్దకొండాపురంలో చంద్రబాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. బాబు ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్ అంటూ అధికారంలోకొచ్చి.. హామీల్లో కోతలు విధిస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కులమతాలు, పార్టీలను చూడకుండా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను అందజేశారన్నారు. చంద్రబాబు అంటే మోసం గ్యారెంటీ అని రాష్ట్ర ప్రజలకు అర్థమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమాదేవి, జేసీఎస్ మండల కన్వీనర్ వెంకటరెడ్డి, నాయకులు రామ్మూర్తి, తిమ్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, వేణు, సోము, రమణ, వెంకటేశులు, లక్ష్మీరెడ్డి, జయశంకర్‌రెడ్డి, అమర్, రెడ్డివారిపల్లి, చిన్నకొండాపురం, మక్కినవారిపల్లి గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



పెద్దకొండాపురంలో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



నరసింహమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: ఇటీవల గువ్వలగుట్టపల్లిలో విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన నరసింహమూర్తి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాల మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పుట్టపర్తి మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించిన ఆయన పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం నింపారు. మొదట నరసింహమూర్తి ఇంటికెళ్లి.. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన భార్య లక్ష్మితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతోనే నరసింహమూర్తి చనిపోయాడని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం అదే గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరసింహప్ప(80) మృతి చెందిన విషయం తెలుసుకొని.. అక్కడికి వెళ్లి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు ఓదార్చారు. ఆ తర్వాత బత్తలపల్లిలో ఇటీవల మృతి చెందిన కృష్ణానాయక్(65) కుటుంబాన్ని పరామర్శించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న చిన్న నాగప్పను పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే వెంట ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరయ్య, మాజీ కన్వీనర్ గంగాద్రి, లాయర్ సతీష్‌రెడ్డి, నాయకులు మల్లికార్జున, గోవిందరెడ్డి, పూర్ణానంద, నారాయణరెడ్డి, రామక్రిష్ణ, తిరుపాల్ నాయక్, అశ్వత్థరెడ్డి, గోవింద్ నాయక్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శ

నల్లమాడ: సానేవారిపల్లికి చెందిన అంకిరెడ్డి గిరిధర్‌రెడ్డి (78) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోమవారం ఉదయం గ్రామానికి వెళ్లి గిరిధర్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే నల్లసింగయ్యగారిపల్లికి చెందిన మల్లెల కిష్టప్ప అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఇంటికెళ్లి పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, సర్పంచ్ కుళ్లాయప్ప, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ రఘునాథరెడ్డి, నాయకులు అరవిందరెడ్డి, ఓబిరెడ్డి, నరసింహమూర్తి, విశ్వనాథరెడ్డి, హరినాథరెడ్డి, శివారెడ్డి తదితరులు ఉన్నారు.

యూరియా కొరతపై నేడు 'అన్నదాత పోరు'

పుట్టపర్తి. యూరియా సరఫరాలో కూటమి సర్కారు నిర్లక్ష్యానికి నిరసనగా మంగళవారం పుట్టపర్తిలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'అన్నదాత పోరు' నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి.. ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తామని శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏనాడూ ఎరువుల కొరత రాలేదని, రైతులకు కావలసినంత సరఫరా చేశామని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం యూరియా ఇతర రసాయనిక ఎరువులకు సంబంధించి రైతులకు సరిపడ సరఫరా చేయడంలో విఫలమైందన్నారు. బ్లాక్‌లో అమ్ముకునేందుకు అవకాశం కల్పించి.. తద్వారా కమీషన్లతో కూటమి నేతలు జేబులు నింపుకుంటూ రైతుల కడుపు కొడుతున్నారని విమర్శించారు. కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

నల్లమాడ: పుట్టపర్తిలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టే 'అన్నదాత పోరు'కు మండలంలోని పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి కోరారు.

- అన్నదాత పోరును విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ అమడగూరు మండల కన్వీనర్ తనకంటి జయప్ప పిలుపునిచ్చారు. సోమవారం కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు.

రైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?

సాక్షి బృందం: రాష్ట్రంలో యూరియా, ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని ఏపీ రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, స్వామిరెడ్డి ప్రశ్నించారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఎన్‌పీకుంట తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతిపత్రం అందించారు. వర్షాభావ పరిస్థితులతో మండలంలో దాదాపు 500 ఎకరాలకు పైగా విస్తీర్ణంలోని వరి, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు.

- కనగానపల్లి, బత్తలపల్లి, ఓడీచెరువు, తనకల్లు, ధర్మవరం, గాండ్లపెంట, తాడిమర్రి, ముదిగుబ్బ మండల కేంద్రాల్లో సీపీఐ, అనుబంధ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. పంటలకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు.



కనగానపల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

అర్ధంతరంగా ఆగిన ఎరువుల పంపిణీ

తాడిమర్రి: కూటమి నేతల ఆగ్రహం.. అన్నదాతలకు శాపంగా మారింది. ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశనగ తదితర పంటలు సాగు చేసిన రైతులకు పంపిణీ చేయడానికి 137 బ్యాగుల యూరియా, 60 బ్యాగుల డీఏపీ, మరో 60 బ్యాగుల కాంప్లెక్స్ ఎరువులు తాడిమర్రి రైతు సేవ కేంద్రానికి చేరాయి. దీంతో ఏఓ శేఖర్ సోమవారం ఎరువులు పంపిణీ చేయడానికి తహసీల్దార్ భాస్కర్‌రెడ్డిని పిలిపించారు. అలాగే బీజేపీ మండల కన్వీనర్‌తో పాటు కొంతమంది నాయకులు, కార్యకర్తలకు సమాచారం ఇచ్చారు. ఉదయం 11 గంటలకు ఎరువులు పంపిణీ మొదలైంది. ఇంతలో సమాచారం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ తన అనుచర గణంతో వచ్చి ఏఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి తమను ఆహ్వానించకుండా ఎలా విస్మరిస్తారంటూ మండిపడ్డారు. కంగుతిన్న ఏఓ పొరపాటు జరిగిందని, పునరావృతం కాకుండా చూసుకుంటానని చెప్పి పంపిణీ ప్రక్రియను మంగళవారానికి వాయిదా వేశారు.

సంక్షిప్త సమాచారం

దళిత, గిరిజనుల సమస్యలపై వినతి

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా దళిత, గిరిజనులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గంగులయ్య, క్రిష్ణమూర్తి, శ్రీనివాసనాయక్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్‌అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దళిత, గిరిజనుల స్థలాలు, శ్మశానవాటికలు అన్యాక్రాంతమవుతున్నాయని, విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

గడువులోపు ఈ–క్రాప్ బుక్ చేసుకోవాలి

బత్తలపల్లి: రైతులు నిర్ణీత గడువులోపు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ స్వర్ణలత, వ్యవసాయాధికారి ఓబిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఓబుళాపురం పంచాయతీలో జరుగుతున్న ఈ–క్రాప్ బుకింగ్‌ను వారు పరిశీలించారు.

యూరియాపై ఆందోళన వద్దు

మండలంలోని రైతుల అవసరం మేరకు తగినంత యూరియా అందుబాటులో ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ స్వర్ణలత, వ్యవసాయాధికారి ఓబిరెడ్డి రైతులకు సూచించారు. సోమవారం రామాపురం రైతు సేవ కేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.

అతిథి అధ్యాపక పోస్టుకు ధరఖాస్తుల ఆహ్వానం

తాడిమర్రి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న జువాలజీ సబ్జెక్టుకు సంబంధించి అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఈ నెల 11న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వెల్లడించారు.

బ్యాంకు ఏర్పాటుకు వినతి

కదిరి అర్బన్: తమ గ్రామంలో ప్రభుత్వ రంగ బ్యాంక్ ఏర్పాటు చేయాలని పట్నం గ్రామానికి చెందిన వెంకటరమణ, పవన్‌కుమార్ తదితరులు సోమవారం విజయవాడలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కన్వీనర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఎన్నో ఏళ్లుగా తాము బ్యాంకు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా ఎవ్వరూ పట్టించుకోలేదని తెలిపారు.

నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం



కవర్లు సీజ్ చేస్తున్న అధికారులు

పుట్టపర్తి టౌన్: పట్టణ పరిధిలోని ప్రశాంతి గ్రామంలో మున్సిపల్ అధికారులు పలు హోటళ్లను తనిఖీ చేసి.. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుని, జరిమానాలు విధించారు. పుట్టపర్తిలో ప్లాస్టిక్‌ను నిషేధించామని, మరోసారి దొరికితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివయ్య, సెక్రెటరీలు భాస్కర్‌రెడ్డి, నరసింహ, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

తనకల్లు: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మూడు సెంట్ల స్థలం మంజూరు చేయాలన్నారు. మండలంలోని సర్వే నంబర్ 793లో ఐదేళ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు వెంటనే పట్టాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివన్న, రైతు సంఘం నాయకులు వీవీ రమణ, ఎస్వీ రమణ, ప్రభాకర్‌నాయక్, సీఐటీయూ ఒంటెద్దు వేమన్న, శ్రీనివాసులు, రామాంజులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పంపిణీ చేయాలి

తాడిమర్రి: ఎరువులు పారదర్శకంగా పంపిణీ చేయాలని వ్యవసాయ అధికారి శేఖర్‌కు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి సూచించారు. తాడిమర్రిలో ఎరువులు నిల్వ చేసిన రైతు సేవ కేంద్రాన్ని సోమవారం ఆయన వ్యవసాయ అధికారులతో కలసి తనిఖీ చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు రైతులకు ఎరువులు పంపిణీ చేయనున్నట్లు ఏఓ తెలిపారు. రైతులు ఏ గ్రామం వారైనా ఎరువులు అత్యవసరం అయితే పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ వైష్ణవి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి రక్షించండి

ఓడీచెరువు : మండల కేంద్రంలో కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలని ఓడీచెరువు యువసైన్యం సభ్యులు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి, ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఊర కుక్కలు వందల సంఖ్యలో తిరుగుతూ దాడులు చేస్తుండడంతో వాహనదారులు, చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే వణికిపోతున్నారన్నారు. తక్షణమే తగు చర్యలు చేపట్టాలని కోరారు.

తెరచుకున్న ఆలయాలు

ముదిగుబ్బ: సంపూర్ణ చంద్రగహణం అనంతరం సోమవారం మండల కేంద్రం ముదిగుబ్బలోని ఆలయాలు తెరచుకున్నాయి. మృత్యుంజయుడు అయిన భవానీ శంకర స్వామికి గ్రహణ దోష నివారణ అర్థం ప్రత్యేకంగా పంచామృతాలతో రుద్రాభిషేకం, తైలాభిషేకం నిర్వహించారు. అదే విధంగా అమర్నాథ లింగేశ్వర అలంకార దర్శనం, చంద్రగ్రహణం పురష్కరించుకొని పితృదేవతల పుణ్య లోకం కోసం తర్పణాలు కార్యక్రమాలు చేపట్టారు.